"జానకి టైపు మిషన్ లోనికి తెల్లకాగితాలను ఎక్కించి, టైపు చెయ్యటం ప్రారంభించి ఆకస్మికంగా ఆగిపోయింది. అనుమానంగా మేనేజర్‌గారి వెనుక భాగాన్నే ఉన్న గోడమీది కాలండర్ వైపు చూసింది. అవును. ఆ రోజు శుక్రవారమే. డిసెంబర్. 20. ఒక్కసారి మనసులో లెక్క వేసుకుని చూసుకుని, 'ఇంపాజిబుల్' అని గొణుక్కుంది. కాని, తనకు బాగా తెలును. అది అసంభవం కాదనికూడాను. అందుచేతనే బిత్తరపోయి గోడ మీద ఉన్న కాలండర్‌నే చూస్తూ ఉండిపోయింది జానకి.

"ఏం, జానకీ! గోడమీద భూతాలేమైనా కనిపిస్తున్నాయా?" అంటూ మేనేజర్ రామనాథంగారు నవ్వేసరికి, జానకి ఈ లోకంలోకి తిరిగి వచ్చింది.



# మనస్సాగర మథనం

## శివం

మళ్ళీ జానకి మనస్సును ఆఫీసు కాగితాల పైన లగ్నం చేసి చకచకా టైపు చెయ్యసాగింది. ఇక ఆ రోజు రోజంతా అతి కష్టంమీదనే ఆఫీసు పనిమీద మనస్సును కేంద్రీకరింపవలసి వచ్చింది. నిజానికి ఇది జానకికి కొత్త నూతన అనుభూతి. ఆమెకి 24 ఏళ్ళ వయస్సే అయినా, ఆ ఆఫీసులో రెండేళ్ళ నుంచి పని చేస్తున్నా, ఎన్ని ఇబ్బందులున్నా, వాటినన్నిటినీ ఆఫీసు గుమ్మం బయటే వదిలేసి లోపలకు రావడం అలవాటు చేసుకున్నది. తన ఇబ్బందులను ఆఫీసు పనికి ఆటంకం కలగ చెయ్యకుండా చూసుకునేది. ఆఫీసులోనికి వచ్చింది మొదలు ఇరుగు పొరుగు వాళ్ళతో బాతాఖానీ వేస్తూ కాలం వృధా చెయ్యకుండా, చిరునవ్వుతో తన పని ఏదో తను ఆసక్తిగా చేసుకుని, సాయంత్రం అయిదవ్వగానే ఇంటికి బయలుదేరేది. అందుకే తనంటే మేనేజర్ రామనాథం గారికికూడా ఇష్టం. తనుకూడా ఆయనను తండ్రిలాగ భావించి, గౌరవంగా చూసేది.

జానకి ఒక విధంగా అదృష్టవంతురాలే. బి.ఎ. పాసవగానే టైపు పాసయి ఉండటం వల్ల హైదరాబాద్‌లోని ప్రైవేటు ఫెర్టిలైజర్ కంపెనీలో టైపిస్టు ఉద్యోగం దొరికింది. ఉద్యోగం దొరికీ దొరకగానే అదే పట్టణంలో టైర్ల కంపెనీలో క్లర్కుగా పని చేస్తున్న రాజారావుతో తన పెద్దలకు వ్యతిరేకంగా ప్రేమ వివాహం జరిగింది. రాజారావు సౌమ్యుడు. బి.కామ్. పాసయ్యాడు. ఇద్దరి జీతాలు కలిసి వెయ్యి రూపాయలకి పైనే వస్తున్నాయి. హాయిగా గడిచిపోతోంది సంసారం. అయితే, రాజారావుకి ఉద్యోగంలో ఇంకా పై హోదాకి వెళ్ళాలని ఉండటంతో ప్రైయివేటుగా యమ్. కామ్. చేస్తానన్నాడు. రెండు మూడేళ్ళ వరకు పిల్లల ప్రసక్తి లేకుండా సంసారాన్ని ఈదడానికి ఇద్దరూ నిర్ణయించుకున్న మీదటే, రాజారావు ఉద్యోగం చేస్తూనే యమ్.కామ్ చెయ్యసాగాడు. జానకికూడా అన్ని విధాలా అతనికి సహకారాన్ని అందించసాగింది.

ఈ సమయంలో పాప కుటుంబంలోకి అడుగు పెట్టడమంటే, అనుకున్న ప్లాను తలకిందులయిపోవడమే! ప్రైయివేటు కంపెనీలో నాలుగయిదు నెలలు సెలవు లివ్వరు కనక, జానకి ఉద్యోగం వదులుకోవలసి ఉంటుంది. రాజారావుకి ఒక్కడికీ వచ్చే ఆరు వందల రూపాయల జీతంతో, మూడు వందలు అద్దె ఇచ్చుకుని ఉండలేడు. చిన్న ఇంట్లోకి మారవలసి ఉంటుంది. ఎంత చిన్న వాటా అయినా, 200

జానకి. తను కనక ఆ మాట కనక అని ఉంటే రాజారావు ఎంత నిరుత్సాహ పడిపోతాడో ఊహించుకుని, జానకి అప్పటికి ఆ ఆలోచనను విరమించుకున్నది. మరో నెల రోజులు ఆగి చెబుదామని నిర్ణయించుకున్నది. జానకి ఆలోచనలతో నెల రోజులు ఇట్టే వెళ్ళిపోయినాయి. తను గర్భవతి నన్న విషయంలో జానకికి అనుమానం ఏమీ లేకపోయింది.

జానకి ఇరువురు వ్యక్తుల్లాగ ప్రవర్తించ సాగింది. ఒక జానకి రాజారావుకు అన్నం వండడం, వడ్డించడం, ఆఫీసుకి పంపించడం, ఇంటి వ్యవహారాలు చూసుకోవడం, ఆఫీసుకి వెళ్ళడం, చిరునవ్వుతో నలుగురితో మాట్లాడటం, కాగితాలు టైపు చెయ్యడం మేనేజర్‌ను మెప్పించడం చేస్తోంది. మరో జానకి, రాజారావుతో విషయం చెప్పడానికి సమయం కోసం ఎదురుచూస్తూ, తనలో తనే జాలిపడుతూ కాలం గడుపుతూంది.

ఆఫీసులో కాలండర్ కాగితాలు తిరుగుతున్నాయి. రాజారావు రాత్రింబవళ్ళు పని చేస్తూ, ఏదో వేళకు వచ్చి భోజనం చేసి, మళ్ళీ ఉదయమే కంపెనీకి పరుగెత్తుతున్నాడు. రాజారావు తన స్వప్నలోకంలో తను విహరిస్తున్నాడు.

జానకికి ఈ మధ్యన పరధ్యానం ఎక్కువయింది. ఏదో ఆలోచిస్తూ టైపు చెయ్యడంలో లైనులే ఎగర కొట్టేస్తోంది.

"ఏమిటి, జానకీ! ఒంట్లో బాగుండటం లేదా? ఈ మధ్య మరీ పరధ్యానంగా ఉంటున్నట్లున్నావు?" అన్నాడు మేనేజర్, ఆమె టైపు చేసిన ఉత్తరాన్ని సంతకం చెయ్యకుండా చూస్తూ.

"అబ్బే...! ఏం లేదండీ! బాగానే ఉన్నాను. సారీ...మళ్ళీ టైపు చేస్తా నివ్వండి" అంటూ ఆ ఉత్తరాన్ని తీసుకుని మళ్ళీ టైపు చేసి మేనేజరుకి ఇచ్చింది. తన పరధ్యానానికి, అసహాయతకు తన పైనే తనకే కోపం వచ్చింది. తనింకే మాత్రం ఈ సమస్యను ఒంటరిగా ఎదుర్కోలేనని నిర్ధారణ చేసుకుని మరొకరి సహాయం అపేక్షించడానికి నిశ్చయించుకున్నది.

టైపు మిషన్ ముందు కూర్చుని, మసక మసకగా కనిపిస్తూన్న కాగితంవైపే చూస్తూ, తనను అర్థం చేసుకుని తనకు అండగా నిలబడ గలిగిన వారు ఎవరా అని జానకి తీవ్రంగా ఆలోచించసాగింది.

తన తల్లితండ్రులున్నారు కాని, వాళ్ళతో తను విరోధ పడి, వాళ్ళ ఇష్టానికి వ్యతిరేకంగా, మరో శాఖకు చెందిన రాజారావును ప్రేమించి వివాహం చేసుకున్నది. అప్పటినుంచి తనకూ, వాళ్ళకూ ఉత్తర ప్రత్యుత్తరాలు గాని, రాకపోకలు గాని లేవు. పోతే, అమ్మమ్మ ఉంది. ఆవిడ ఆరు పురుళ్ళు పోసుకుంది. పైగా ఎంతోమంది కూతుళ్ళకు పురుడు పోసింది. తను అంటే ప్రాణం ఇస్తుంది. తనను అర్థం చేసుకో గలుగుతుంది. కాని, నిజామాబాద్ వెళ్ళి రావాలి. రెండు రోజులు పడుతుంది వెళ్ళి వచ్చేసరికి. డబ్బు ప్రశ్న కాదు గాని, రాజారావు వేసే సవాలక్ష ప్రశ్నలకు అనుమానం కలగకుండా సమాధానం చెప్పాలి ముందుగా. అందుచేత తన సమస్యను ఉత్తరం ద్వారా ఆవిడకు చెప్పడమే ఉత్తమమైన మార్గం అనే నిర్ణయానికి వచ్చింది జానకి. ఆ దినాన్నే సిగ్గును అవతలకు నెట్టి, ఉత్తరం రాసి పోస్టు చేసింది.

అయిదో రోజు కల్లా నిజామాబాదు నుంచి జవాబు వచ్చింది. పట్టి పట్టి రాసిన అక్షరాలు కొమ్ములు, దీర్ఘాలు లేని ఎన్నో పదాలు. అయినా చెప్పదలచుకున్న దాన్ని కుండ పగలకొట్టినట్లు చెప్పింది. ఆ ఉత్తరం చూడగానే జానకికి ప్రాణం లేచివచ్చినట్లయింది. ఉత్తరాన్ని జాగర్తగా ఒకటికి రెండు సార్లు చదువుకున్నది.

"పిల్లలలో ఎవరైనా అనుకోకుండా అంటే పథకం వేసుకోకుండా పుట్టారా అని అడిగావు. ఏం ప్రశ్న? ఆ రోజుల్లో ఈ పరిమిత కుటుంబ పథకాలు వగైరా ఎక్కడున్నాయి? ఆరుగురు పిల్లలూ అనుకోకుండా పుట్టి, బోలెడు ఇబ్బంది కలిగించిన వాళ్ళే. అయితే, ఎవ్వరూ తలకిందులు కాలేదు. అట్లాగే సర్దుకుని పోయాము. ఆదాయం అభివృద్ధి చేసుకోడానికని గొడ్డూ గోదా పెంచాము. మీ తాత మరి కొంత పొలం కౌలుకి తీసుకుని వ్యవసాయం ప్రారంభించారు. మేము ఎన్ని ఇబ్బందులు పడవలసి వచ్చినా, ఒకరి కొకరు ధైర్యం చెప్పుకుని, ఒకరి కొకరు అండగా ఉండి, ముందుకు సాగిపోయాం. దేవతల్లాంటి పిల్లల్ని ఎన్నడూ తిట్టుకోలేదు. భగవత్కృపవల్ల అంతా పిల్లా పాపలతో ఈనాడు ఎవరి బతుకులు వాళ్ళు హాయిగా వెళ్ళబుచ్చుకుంటున్నారు.

తల్లి పవబోతున్నందుకు గర్వించాలి గాని, సిగ్గు పడకూడదు. మనం కోరుకున్నా, కోరుకోకపోయినా బిడ్డ బిడ్డే. బిడ్డను తల్లితండ్రులు ఆహ్వానించకపోతే మరెవరు ఆహ్వానిస్తారు? నువ్వు అనవసరపు భయాలు పెట్టుకోక, మరోసారి డాక్టర్‌గారి వద్దకు వెళ్ళి నిర్ధారణ చేసుకుని, రాజారావుకు ఈ శుభవార్త చెప్పెయ్యి. అతను తప్పక ఆనందిస్తాడు. ఆరవ నెల రాగానే నాకు వ్రాయి. నేను అక్కడకు వచ్చి నిన్ను పిల్చుకొస్తాను. నేను కూడా తల్లి కంటె ఎక్కువగా నిన్ను చూసుకోగలను. ఆశీర్వచనాలతో- మీ అమ్మమ్మ."

ఉత్తరాన్ని పదే పదే చదువుకున్నది ఆనందంతో జానకి. కొండంత బలం వచ్చినట్లనిపింగా ఉత్తరాన్ని మడిచి పదిలంగా డ్రాయర్‌లో దాచుకున్నది. ఆ రోజు రాత్రి రాజారావు రాగానే ఏ సంగతీ చెప్పాలని నిర్ణయించుకుని, అప్పటికప్పుడు దగ్గరలోనే ఉన్న లేడీ డాక్టర్ వద్దకు బయలుదేరింది. లేడీ డాక్టర్ పరీక్ష చేసి, జానకి గర్భవతి అని ధృవీకరించింది. ఆనందంతో తేలిపోతూ, ఇంటికి వచ్చి వంట చేసి రాజారావు రాక కోసం ఎదురు చూడసాగింది.

ఆ రాత్రి రాజారావు భోజనం ముగించి, పుస్తకం అందుకోక మునుపే, జానకి అతనిని సమీపించి బెరుకు బెరుగ్గా అన్నది. "ఇవ్వేళ మీతో ఒక ముఖ్యమైన సంగతి చెప్పాలని అనుకుంటున్నాను."

"ఏమిటోయ్! ఉదయం లేని ముఖ్యమైన విషయం, రాత్రికి ఎట్లా వచ్చి పడింది?" అన్నాడు ఆశ్చర్యంగా.

"నవ్వుతాలకి కాదు. నిజంగానే అంటున్నాను. ఎప్పుడో చెప్పవలసిన విషయంగాని, ధైర్యం చాలక ఇన్నాళ్ళూ చెప్పలేదు."

"ఊ! అయితే, చెప్పెయ్యి" అన్నాడు రాజారావు, ఆమె మొహంలోకి చూస్తూ.

"మీరు...మీరు తండ్రి కాబోతున్నారు!"

"వాట్... వాట్ తండ్రా? నేనా!" అన్నాడు ఆశ్చర్యంగా చూస్తూ, ఆమె చేతుల్ని మృదువుగా తన చేతుల్లోకి తీసుకుంటూ.

"అవును. మరే..." అన్నది. అతని మొహంలోని భావాల ను చదవడానికి ప్రయత్నిస్తూ, అతను కోపం తెచ్చుకోకూడదని లోలోపల ప్రార్థించుకుంటూ.

"ఏమిటి? నిజంగానే!" నమ్మలేనట్లు, కళ్ళు చిట్లిస్తూ అడిగాడు రాజారావు.

"అవును. నిజంగానే!" అన్నది జానకి- భగవాన్! ఇప్పటికైనా అతని ముఖంలో సంతోషం కనపడనియ్యి అని అనుకుంటూ.

మతి పోయినట్లు తల ఊపుతూ, నమ్మశక్యం కాకుండా ఉం దీ కబురు" అన్నాడు. అతని ముఖంలో సంతోషమూ కనబడటం లేదు. విచారమూ కనిపించటం లేదు. బహుశా దిమ్మరపోయి ఉంటాడు. ఇది మరీ దారుణమైన పరిస్థితి అనుకున్నది జానకి.

జానకి అతని ముఖం వైపోసారి చూసి, "నన్ను క్షమిస్తా రనుకుంటాను" అని భయం భయంగా అనగలిగింది.

నెమ్మదిగా అతని మొహం తేట పడినట్లయింది. అంతవరకు ఆవరించిన మేఘం తొలగినట్లు, ప్రకాశవంతంగా కనిపించసాగింది.

"అయితే, నీ కీ విషయం ఎన్నాళ్ళనుంచీ తెలుసు. ఎప్పుడో చెప్పవలసిందని ఇందాకా అన్నావు," అన్నాడు రాజారావు. చిరునవ్వుతో ఆమెను చూస్తూ.

జానకి మనస్సు కొంచెం తేలిక పడింది. తను ఎదురు చూసిన తుఫాన్ తొలగిపోయినట్లుంది.

"నెల రోజులనుంచీ అనుమానంగా ఉంది. ఇవ్వేళనే డాక్టరు ఖచ్చితంగా తేల్చి చెప్పింది."

రాజారావు మొహంలో నవ్వు మాయమయింది. ఆమె వంక చిరుకోపంతో చూస్తూ, "అయితే, నెల రోజులనుంచీ ఇంత మంచి విషయాన్ని నాక్కూడా చెప్పకుండా నీ మనస్సులో దాచుకున్నా వన్నమాట?" అన్నాడు.

"మీ ప్లానన్నీ తల కిందులయ్యే యని కోపగించుకుంటారని చెప్పడానికి భయపడ్డాను ఇన్నాళ్ళూ ఎట్లా చెప్పాలి" అని బాధ పడుతున్నానుం అన్నది జానకి.

"అయితే,ఇన్నాళ్ళూ నీ మనస్సులో నువ్వే మథన పడిపోతూ ఒక్కర్తెవూ బాధ పడ్డా వన్నమట. నాతో ఒక్క ముక్కయినా అనకుండా ఉండటానికి, నన్ను ఎంతో తక్కువగా అంచనా వేశావు, జానకీ!" అన్నాడు రాజారావు ఆప్యాయంగా జానకి తల నిమురుతూ.

"అది కాదండీ! మీ చదువుకు, ఆలోచనలకు ఇబ్బంది కలగకుండా ఉండాలని వేరే మార్గం ఏదైనా ఉందేమోనని ఆలోచించసాగాను."

"ఏమిటి, జానకీ, ఏమిటి ను వ్వనేది? నా చదువుకూ, దీనికీ సంబంధం ఏమిటి? నీ పిచ్చి ఆలోచనలు ఏమిటో నాకు అర్థం కావడం లేదు."

"ఇంతవరకూ మనిద్దరి సంపాదనతో మన సంసారం హాయిగా గడిచిపోతోంది కదా! రేపు నా ఉద్యోగం పోతే, మీ ఒక్కరి సంపాదనతో, మీ చదువు, మన సంసారం...ఇదంతా ఎట్లానా అని?"

"చదువు ఏమయిపోతుంది, జానకీ? వచ్చే సంవత్సరం చదువుకుంటాను. ఏదో ట్యూషన్లు చెప్పో, టైపు చేసో ఒక ఆర్నెల్లు గడపలేక పోతాననుకున్నావా.. తరవాత మళ్ళీ కావాలనుకుంటే నువ్వు ఇంకో ఉద్యోగం చూసుకోవచ్చు. నాకు చెప్పకుండా ఇన్నాళ్ళూ అనవసరంగా ఎందుకు నీలో నువ్వు బాధ పడ్డావు, జానకీ?"

"మరే..."

"ఇంక నా కేం చెప్పకు" అంటూ ఆమెను అనురాగంతో దగ్గరగా తీసుకున్నాడు రాజారావు.

జానకి అరమోడ్పులతో రాజారావు కౌగిలిలో గువ్వలాగ ఒదిగిపోతూ, మనస్సులోనే అమ్మమ్మకు, ఆమె ఇచ్చిన ధైర్యంతో కూడిన సలహాకు కృతజ్ఞతలు చెప్పుకున్నది. ★